క్లుప్తంగా

ఉచిత హోమియో వైద్య శిబిరం నేడు

ఆరిలోవ : జీవీఎంసీ పదో వార్డు పరిధి ఇందిరా నగర్‌లోని ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించను న్నట్లు ఆశ్రమం స్వామీజీ సౌమ్యానంద అవదూత తెలిపారు. హోమియో వైద్యుడు డాక్టర్ పి.ఎస్.సుధాకర్ పర్యవేక్షణలో ఉదయం 10 గంటల నుంచి వైద్య సేవలు అందించను న్నట్లు తెలిపారు. అవసరమైన వారు 9550775518లో సంప్రదించాలని, లేదంటే నేరుగా ఇందిరానగర్‌లో ఆశ్రమానికి చేరుకో వాలని ఆయన సూచించారు.

ఉత్తరాంధ్రపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి



మాట్లాడుతున్న లగుడు గోవిందరావు

ఏయూ క్యాంపస్ : ఉత్తరాంధ్ర ప్రాంతంపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని ఉత్తరాంధ్ర పరిరక్షణ సమితి అధ్యక్షుడు లగుడు గోవింద రావు డిమాండ్ చేశారు. బీచ్‌రోడ్డులోని ఒక హోటల్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్రపై డిక్లరేషన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. విశాఖ వేదికగా జరుగుతున్న సభలో పాల్గొంటున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జె.పి. నడ్డా ఉత్తరాంధ్ర డిక్లరేషన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉక్కు కర్మాగారానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని, పూర్తిస్థాయిలో రైల్వేజోన్ ఏర్పాటు చేయాలన్నారు. అమరావతికి దీటుగా ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలన్నారు. ఆర్థిక రాజధానిగా విశాఖను ప్రకటించడంతోనే సరిపెడుతున్నారని, అభివృద్ధి చేయడం లేదన్నారు. విశాఖలో ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్తలు, నాయకులు పాల్గొన్నారు.


ఎల్లాజీరావుకు రెడ్‌క్రాస్ ఉత్తమ సేవా అవార్డు



అవార్డు అందుకుంటున్న ఎల్లాజీరావు

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీ అప్పుఘర్‌కు చెందిన చీపల్లి ఎల్లాజీరావుకి రెడ్‌క్రాస్ ఉత్తమ సేవా అవార్డు లభించింది. నగరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్ వేదికగా రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన అవార్డు అందుకున్నారు. ఎల్లాజీరావు ఉత్తమ రక్తదాతగా నిలవడంతోపాటు మెగా ఫ్యామిలీ యువత పేరుతో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు అవార్డు అందుకున్నారు. ఎల్లాజీరావును జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్ సత్కరించి అవార్డు అందజేశారు.

పాలస్తీనాకు సంఘీభావంగా ర్యాలీ



బీచ్‌రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న సభ్యులు

ఏయూ క్యాంపస్ : ఇజ్రాయిల్ దురాక్రమణను నిరశిస్తూ గ్లోబల్ సమద్ పోటిల్లాకు మద్దతుగా ఇండియన్ పీపుల్ ఇన్ సోలిడారిటీ విత్ పాలస్తీనా ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం బీచ్ రోడ్డులో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి సుజన్ మాట్లాడుతూ గత 23 నెలలుగా ఇజ్రాయిల్ సాగిస్తున్న దాడుల్లో 65 వేల మంది వరకు ప్రజలు చనిపోయారని, వారిలో 20 వేల మంది చిన్నారులే ఉన్నారన్నారు. మానవత్వంలేని ఇటువంటి దుశ్చర్యలను ఖండించాలని కోరారు. ప్రజలకు ఆహారం, మందులు అందించడానికి వెళ్తున్న నౌకా బృందంపై రెండు సార్లు ఇజ్రాయిల్ డ్రోన్‌లతో దాడులు చేసిందన్నారు. ప్రజలంతా సంఘటితంగా ఇటువంటి దుశ్చర్యలను ప్రతిఘటించాల్సిన అవసరం ఉందన్నారు. గ్లోబల్ సమద్ పోటిల్లాకు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు.



ఆరిలోవ ఆఖరి బస్టాప్ వద్ద మట్టి దిబ్బలు



విమ్స్ ఆవరణలో మట్టి దిబ్బలు, కేబుల్ చక్రాలు



40 గజాల కాలనీ, హెల్త్‌సిటీ మధ్యలో గోతులు, మట్టిదిబ్బలు, కేబుల్ చక్రాలు

తవ్వి.. వదిలేశారంతే

- ఆరిలోవ సబ్‌స్టేషన్ పరిధిలో ఐదు నెలల క్రితం భూగర్భ విద్యుత్ కేబుల్ పనులు ప్రారంభం
- ఇందుకోసం ఎక్కడికక్కడ గోతులు తవ్వి రోడ్లపై మట్టి వేయించేసిన కాంట్రాక్టర్
- నేటికీ పనులు పూర్తికాకపోవడంతో ప్రమాదకరంగా రోడ్లు, గోతులు
- హెల్త్‌సిటీ, విమ్స్, ఆరిలోవ ప్రధాన కూడళ్లతోపాటు నివాసాల మధ్య నత్తనడకన పనులు



40 గజాల కాలనీలో నివాసాల ముందు మట్టి దిబ్బలు



ముడసర్లోవ వద్ద తవ్విన గోతులు, పక్కనే మట్టి దిబ్బలు



హెల్త్‌సిటీలో పూడ్చుతున్న గోతులు

ఆరిలోవ : ఆరిలోవ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ (యూజీసీ) పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఆరిలోవ ప్రాంతంలో జరుగుతున్న ఈ పనులు ఎక్కడపడితే అక్కడే అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో స్థానికులు ఇబ్బందిపడడంతోపాటు వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక డంపింగ్‌యార్డు సమీపంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి ఆరిలోవ ఆఖరి బస్టాప్, 40 గజాల కాలనీ, హెల్త్ సిటీ వరకు, విమ్స్ ప్రాంగణంలో సబ్ స్టేషన్ నుంచి విమ్స్ రోడ్లు, డెయిరీఫారం వైపు అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ పనులు సుమారు ఐదు నెలల క్రితం ప్రారంభించారు. ఈ పనులు ప్రారంభం నుంచి నత్తనడకన ఇప్పటి వరకు సాగుతున్నాయి. ఈ పనుల్లో భాగంగా రోడ్లు పక్కన నాలుగు అడుగుల లోతున గోతులు తవ్వేశారు. వాటిలో కేబుళ్లు అమర్చుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో కేబుల్ అమర్చి మట్టితో పూడ్చి వదిలేశారు. అలాంటి చోట వర్షం కురిసినప్పుడల్లా బురదమయంగా మారిపోయి స్థానికులు నడవడానికి ఆటంకంగా మారుతోంది. మరికొన్నిచోట్ల గోతులు సరిగా పూడ్చకపోవడంతో లోయల్లా ఏర్పడ్డాయి. ఇంకొన్నిచోట్ల రోడ్లుపై మట్టి దిబ్బలుగా వేసేశారు. నత్తనడకన సాగుతున్న ఈ పనులను పర్యవేక్షించే అధికారులే కరువయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఇదీ పనులు జరుగుతున్న తీరు...

- ముడసర్లోవ వెనుక రోడ్లలో ఎక్కువగా ఉదయం, సాయంత్రం వేళల్లో నడక కోసం స్థానికులు వెళ్తుంటారు. ఈ రోడ్లలో చేపట్టిన పనుల్లో భాగంగా పలుచోట్ల మట్టి దిబ్బలు వదిలేశారు. కొన్నిచోట్ల ఇంకా కేబుళ్ల కనెక్షన్లు ఇవ్వాల్సిన చోట్ల పెద్ద గొయ్యిలను అలాగే వదిలేశారు. పక్కనే మట్టి దిబ్బలు కూడా వేసేశారు. దీంతో వాకర్స్ ప్రమాదాలకు గురవుతున్నారు.
- ఆరిలోవ ఆఖరి బస్టాప్ నుంచి 40 గజాల కాలనీ వరకు రోడ్డు తవ్వేసి అరకొరగా పూడ్చారు. దీంతో వర్షం కురిస్తే రోడ్డంతా బురదమయంగా మారిపోవడంతో పాటు కొన్నిచోట్ల మటి దిబ్బలను అలానే వదిలేయడంతో నడవలేక పోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- హెల్త్ సిటీలోకి ఆరిలోవ కాలనీ నుంచి ఈ కేబుల్ లైన్ కలుపుతూ గోతులు తవ్వేశారు. ఇక్కడ ఓ పక్క లోతైన గోతులు, మరో పక్క మట్టి దిబ్బలతో బీఆర్‌టీఎస్‌కు రోజూ నడక కోసం వెళ్తున్న వాకర్స్ నరకయాతన అనుభవిస్తున్నారు.



పార్వతీనగర్ కూడలిలో తవ్విన గోతులు, నివాసాలకు అడ్డంగా కేబుల్ చక్రాలు

- హెల్త్‌సిటీ లోపల రోడ్లను కేబుళ్లు అమర్చడానికి పూర్తిగా తవ్వేశారు. రోడ్లు తవ్వేసి పనులు పూర్తి చేయకపోవడంతో రోగులు, వారి బంధువుల రాకపోకలు, వారి వాహనాలు నిలుపుకోవడానికి వీలుకాని పరిస్థితి నెలకొంది.
- విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్) ఆవరణలో విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి ఇక్కడ రోడ్లను తవ్వేశారు. ఐదు నెలలు గడుస్తున్నా ఇంతవరకు పనులు పూర్తి కాకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. కేబుళ్లతో తీసుకొచ్చిన పెద్ద చక్రాలు ఎక్కడపడితే అక్కడే నిర్లక్ష్యంగా వదిలేయడంతో రాకపోకలకు అడ్డంకిగా మారాయి.
- చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా గుడి నుంచి సూర్యతేజనగర్ మీదుగా పార్వతీనగర్ వరకు అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ పనులు మరింత నత్తనడకన సాగుతున్నాయి. పార్వతీనగర్, శ్రీకాంత్‌నగర్ కూడలిలో ఈ పనుల కోసం గోతులు తవ్వి వదిలేయడంతో ఇబ్బంది పడుతున్నామని వాహనచోదకులు వాపోతున్నారు. ఈ కూడలిలో కేబుళ్లతో వచ్చిన చక్రాలను నివాసాలకు ముందు స్థానికుల రాకపోకలకు అడ్డంగా నిలిపేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌తో త్వరగా పనులు పూర్తిచేయించి గోతులు పూడ్చాలని కోరుతున్నారు. రాకపోకలకు అడ్డంకిగా రోడ్లపై ఉన్న మట్టిని, చక్రాలను తొలగించాలని కోరుతున్నారు.

కష్టపడే వారికి వైఎస్సార్‌సీపీలో సముచిత స్థానం



వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అప్పారావుకు మిఠాయి తినిపిస్తున్న వానపల్లి ఈశ్వరరావు

మద్దిలపాలెం : వైఎస్సార్‌సీపీని నమ్ముకుని కష్టపడి పనిచేసే ప్రతీ కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం లభిస్తుందని ఆ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు అన్నారు. ఇందులో భాగంగానే పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశీస్సులతో వానపల్లి ఈశ్వరరావు రాష్ట్ర చేనేత విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారన్నారు. సీతమ్మధారలోని తూర్పు నియోజకవర్గ కార్యాలయంలో మొల్లి అప్పారావును ఈశ్వరరావు శనివారం మర్యాద పూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం అప్పారావు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కష్టపడిన కార్యకర్తలందరికీ సముచితస్థానం కల్పిస్తామన్నారు. అనంతరం వానపల్లికి మొల్లి అప్పారావు మిఠాయి తినిపించి సత్కరించి అభినందించారు. జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ అల్లంపల్లి రాజబాబు, 13వ వార్డు అధ్యక్షుడు సత్యాల వెంకట్, గూడపాటి విక్టర్, తూర్పు నియోజకవర్గ బీసీ విభాగం అధ్యక్షుడు బేతా దుర్గారావు, కాకర గోవింద్, వంకర బాబూరావు, పాండ్రంగి శ్రీను, సూకీ సురేష్, కృష్ణంరాజు, కనకాల కృష్ణ పాల్గొన్నారు.

ఇగ్నోలో 15 వరకు స్వచ్ఛతా పక్షోత్సవాలు



విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ధర్మారావు తదితరులు

ఎంవీపీ కాలనీ : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛభారత్ అభియాన్‌లో భాగంగా స్వచ్ఛతా పక్షోత్సవాలను ఇగ్నో ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ నెల 15 వరకు పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ విశాఖ ప్రాంతీయ కార్యాలయం డైరెక్టర్ డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం ఇగ్నో విశాఖ అధికారులు, సిబ్బంది స్వచ్ఛభారత్ నిర్వహించారు. కార్యాలయం పరిసరాలను శుభ్రపరచడంతోపాటు దత్తత గ్రామం అయ్యన్నపాలెంలో విద్యార్థులు, గ్రామస్తులతో కలిసి ప్రతిజ్ఞ చేయించడంతోపాటు పరిసరాలను శుభ్రం చేశారు. గ్రామంలోని విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఇగ్నో ప్రతినిధులు పాల్గొన్నారు.

కూటమి మోసాలను ప్రజలకు వివరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మొల్లి అప్పారావు

మద్దిలపాలెం : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలపై క్షేత్ర స్థాయిలో ప్రజలకు వివరించి చైతన్యవంతులను చేయాలని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు సూచించారు. సీతమ్మధారలోని కార్యాలయంలో జీవీఎంసీ 17వ వార్డు నాయకులు, కార్యకర్తలతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీని ఏవిధంగా బలోపేతం చేయాలి.., పార్టీ కార్యక్రమాల విజయవంతంలో నాయకులు, కార్యకర్తల పాత్ర ఎలా వుండాలో సూచించారు. కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు తెలియజేయడమే అజెండాగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని కోరారు. వార్డు అధ్యక్షుడు నీలారెడ్డి, వార్డు పరిశీలకులు వైద నారాయణరావు, సుబ్రహ్మణ్యం, పిల్లా సత్యవతి, బోర కుమార్ రెడ్డి, గణేశ్ రెడ్డి, లవణ్ కుమార్, మంగరాజు, డి.రవి, వెంకట అప్పలరెడ్డి, లక్ష్మణ్, ఎస్.రవి, సత్యనారాయణ, శ్రీను, కుసుమ, కొండబాబు, వాసు, వరహాలు, నంది, చింతాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యూజీడీ పనులకు శంకుస్థాపన

ఆరిలోవ : జీవీఎంసీ పదో వార్డు పరిధి డెయిరీ ఫారం వద్ద కొండవాలు ప్రాంతంలో యూజీడీ పనులు ప్రారంభమయ్యాయి. ఇక్కడి పనుల కోసం జీవీఎంసీ రూ.36 లక్షలు కేటాయించింది. ఈ పనులకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ, వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు, స్థానిక నాయకులు రాజశేఖర్, అప్పలనాయుడు, రాజేష్, రమణ, తాతారావు పాల్గొన్నారు.

కళాకారులను ప్రోత్సహించాలి



కళాకారులతో కమల్ బెయిడ్, గంట్ల శ్రీనుబాబు, బీకే రామేశ్వరి, తదితరులు

మద్దిలపాలెం : విభిన్న నృత్యాలు మన సంస్కృతి, సాంప్రదాయాలకు చిహ్నాలుగా నిలుస్తున్నాయని పారిశ్రామికవేత్త, సంఘ సేవకులు కమల్ బెయిడ్ అన్నారు. జీవీఎంసీ 15వ వార్డు పరిధి సీతమ్మధార ఏపీఎస్ఈబీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశ మందిరంలో స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్, ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి నృత్య పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారుల ప్రతిభకు చేయూత అందించి ప్రోత్సహించాలన్నారు. విశాఖ జిల్లా కళాకారుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ప్రతిభ ఆధారంగా విశాఖ జిల్లా కళాకారులకు అంతర్జాతీయ స్థాయి అవకాశాలు వస్తున్నప్పటికీ ఆర్థిక పరిస్థితులు సహకరించక వెనుకంజ వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటి వారిని స్వచ్ఛంద, సేవా సంస్థలు ప్రోత్సహించాలని కోరారు. రెండు రోజుల పాటు జరిగే పోటీల్లో తొలిరోజు వందలాది మంది విద్యార్థులు తమ ప్రతిభ ప్రదర్శించారు. పలువురు కళాకారులకు అతిథులు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. బీకే రామేశ్వరి, ఆర్.నాగరాజు పట్నాయక్, కొండ్రు రామారావు, సింహాద్రి రాజు, సి.సుజని, డాక్టర్ విజయవేణి, కె.సత్తిరాజు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కును ప్రైవేటీకరించొద్దని ఆందోళన



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

బీచ్‌రోడ్డు: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, విభజన చట్టంలో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ఆదివారం విశాఖలో పర్యటిస్తున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జె.పి. నడ్డా ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎ. విమల, రాష్ట్ర సమితి సభ్యుడు ఎం. పైడిరాజు, జిల్లా కార్యదర్శి ఎస్.కె. రహిమాన్ తదితరులు మాట్లాడారు. ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేట్‌పరం చేయడం లేదని చెబుతున్న కూటమి ప్రభుత్వం ఇంకో పక్క ఉక్కులో 43 విభాగాలను ఒక్కొక్కటిగా ప్రైవేట్‌పరం చేయడం వెనుక గల మతలబు ఏమిటో చెప్పాలన్నారు. విశాఖకు ఏం చేశారని ఇక్కడ సభ పెట్టారని ప్రశ్నించారు. జె.పి. నడ్డా విశాఖ పర్యటనలో ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని, విభజన చట్టంలోని హామీలు అమలు చేస్తామని, విశాఖ రైల్వే జోన్ కార్యకలాపాలు ఎప్పటి నుండి ప్రారంభిస్తారో ప్రజలకు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం చేస్తే కూటమి ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజల్లో చరిత్ర హీనులుగా మిగిలిపోతారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పి. చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు, ఆర్. శ్రీనివాసరావు, కె. వనజాక్షి, ఎం.డి. బేగం, ఎం. మన్మథరావు, సీఎస్ క్షేత్రపాల్, ఎస్. నాగభూషణం, వై. రాంబాబు, ఎ. దేముడమ్మ, బి. పుష్పలత, కె. లక్ష్మణరావు, జి. జయ, ఎ. ఆదినారాయణ, పి. గోవింద్, జి. రాంబాబు, ఎం. శ్రీనివాసరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్, తదితరులు

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం రాజనీతి, ప్రభుత్వ పాలనా శాస్త్రం, ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెమోక్రటిక్ ఎంగేజ్మెంట్ అండ్ అకౌంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15న నిర్వహించనున్న అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవ పోస్టర్‌ను వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ తన కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. సెప్టెంబర్ 15ని అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పొలిటికల్ సైన్స్ విభాగంలో కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పూర్వ రాజ్యసభ సభ్యుడు, విశ్వ హిందీ పరిషత్ అధ్యక్షుడు పద్మభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, విభాగాధిపతి ఆచార్య పేటేటి ప్రేమానందం, డీన్ ఆచార్య కె.శ్రీనివాసరావు, ఆచార్య జి.ఎం.జె.రాజు, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ టి.నాగరాజు, డాక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యూజీడీ లీక్‌తో దుర్వాసన



పాడైపోయిన యూజీడీ నుంచి వస్తున్న మురుగు

బీచ్‌రోడ్డు : జీవీఎంసీ 20వ వార్డులోని పెదవాల్తేరు మునసబ్ వారి వీధిలో కాలువ పక్కనే ఉన్న యూజీడీ పాడైపోవడంతో మురుగు నీరు బయటకు వచ్చేస్తోంది. దీంతో దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించి దుర్వాసనకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

అక్కడ తొలగించి.. ఇక్కడ పెట్టించేశారు..!

- హైవే పక్కన అక్రమంగా ఏర్పాటు చేసిన బడ్డీలు తొలగించిన అధికారులు
- వాటిలో టీ టైం బడ్డీని జీవీఎంసీ పదో వార్డు కార్యాలయం ఎదురుగా రోడ్డు పక్కన ఏర్పాటు చేయించిన టీడీపీ నాయకులు
- ఎమ్మెల్యే ఆశీస్సులతోనే ఏర్పాటు చేశారని స్థానికుల గుసగుసలు



జాతీయ రహదారి పక్కన బడ్డీలు తొలగించిన స్థలం



హైవేపై తొలగించి... డెయిరీఫారం వద్ద ఏర్పాటు చేయించిన బడ్డీ (టీ టైం) వద్ద ఎమ్మెల్యే వెలగపూడి

ఆరిలోవ : జీవీఎంసీ పదో వార్డులో టీడీపీ, జనసేన నాయకులు రహదారులకు ఇరువైపులా అనధికారికంగా బడ్డీలు ఏర్పాటు చేయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇటీవల ఇందిరానగర్ వద్ద జాతీయ రహదారి పక్కన గెడ్డను ఆక్రమించి అనధికారికంగా బడ్డీలు పెట్టించారు. దీనిపై ఈ నెల 4న స్థలం చదును చేసేయ్.. బడ్డీలు పెట్టేయ్ శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి జీవీఎంసీ అధికారులు, నేషనల్ హైవే అథారిటీ అధికారులు స్పందించారు. వెంటనే అక్కడ అక్రమంగా ఏర్పాటు చేసిన నాలుగు బడ్డీలను తొలగించేశారు. అంతవరకు బాగానే ఉన్నప్పటికీ... వాటిలో ఓ బడ్డీ (టీ టైం)ని మాత్రం అక్కడ తొలగించిన అనంతరం డెయిరీ ఫారం వద్ద జీవీఎంసీ వార్డు కార్యాలయం ఎదురుగా ప్రధాన రహదారి పక్కన మళ్లీ పెట్టించేశారు. ఆ బడ్డీని స్థానిక టీడీపీ, జనసేన నాయకులు ఎమ్మెల్యే సహాయంతో ఇక్కడకు తరలించి ఏర్పాటు చేయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ ఆరోపణలకు బలం చేకూర్చేలా... వార్డులో శనివారం యూజీడీ పనుల శంకుస్థాపనకు వచ్చిన ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ అదే బడ్డీ వద్ద స్థానిక కార్పొరేటర్, టీడీపీ నాయకులతో కలిసి టీ తాగి కొంతసేపు సేదతీరారు. దీంతో ఆ బడ్డీ ఇక్కడ అనధికారికంగా ఏర్పాటు చేయడానికి ఎమ్మెల్యే సహకారం ఉందన్న ఆరోపణలు నిజమేనని కొందరు స్థానిక టీడీపీ నాయకులే గుసగుసలాడుకుంటున్నారు. ఇందిరానగర్‌లో ఈ నెల 3న రోడ్ల శంకుస్థాపనకు వెళ్లిన ఎమ్మెల్యేకి స్థానికులు కొందరు జాతీయ రహదారి పక్కన అనధికారికంగా ఏర్పాటు చేసిన బడ్డీలపై ఫిర్యాదు చేశారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి ఆ బడ్డీలను తొలగించేయాలని అక్కడున్న జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. అయితే అక్కడ తొలగించిన టీ – టైం బడ్డీని మాత్రం డెయిరీఫారం వద్ద ఆయన సహకారంతోనే ఏర్పాటు చేయించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు ఈ బడ్డీని ఇక్కడే కొనసాగిస్తారో... పూర్తిగా తొలగించి ఆరోపణలకు చెక్ పెడతారోనని స్థానికులు ఎదురు చూస్తున్నారు.